

రైతన్న దగా..!

- నిబంధనల పేరిట రైతు భరోసా అందని వైనం
- గత టీడీపీ ప్రభుత్వంలో రూ.50 వేల రుణమాఫీ
- 6.50 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఇచ్చింది రూ.37 వేలే
- ఉమ్మడి జిల్లాలో 5.05 లక్షల మందికే భరోసా

కర్నూలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మట్టిని నమ్ముకున్న కష్టజీవులకు చంద్రన్న అండగా నిలిచారు. వ్యవసాయంలో రైతులకు భరోసా అందించారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన కష్టజీవులకు రుణ విముక్తి కల్పించాలనే లక్ష్యంతో 2014 ఎన్నికల ముందు రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రూ.50 వేల లోపు రుణాలను ఏక కాలంలో మాఫీ చేసి రైతులను రుణ విముక్తులను చేశారు. రూ.1.50 లక్షల వరకు నాలుగు విడతల్లో రుణమాఫీ చేశారు. ఆనాడు అన్నదాతలకు రూ.2,475 కోట్లకు పైగా ప్రయోజనం లభించింది. ఎన్నికల ముందు అన్నదాతా సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రూ.10 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. అయితే నాటి ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. వైసీపీ విజయం సాధించి జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. రైతు భరోసా పథకం తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన కింది ఇచ్చే సాయం కాదని జగన్ ప్రభుత్వం ఇచ్చిన భరోసా ఏటా కేవలం రూ.7,500లే. ఐదేళ్లలో ఒక్కో రైతుకు లబ్ధిచేకూరింది కేవలం రూ.37 వేలు మాత్రమే. పైగా నిబంధనలు పేరిట కోత పెట్టడంతో సుమారు 2.50 లక్షల మంది రైతులు భరోసాకు దూరమయ్యారు. ఇది రైతులను దగా చేయడం కాదా..? అని రైతు నాయకులు జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.



ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లో 10.50 లక్షల హెక్టార్ల సాగు భూములు ఉన్నాయి. మట్టిని నమ్ముకొని ఆ మట్టిలో స్వేదం చిందించే రైతులు దాదాపుగా 7.50 లక్షలకు పైగానే ఉన్నారు. అందులో సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతులు ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాదయాత్ర చేసిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గ్రామీణ రైతులు పండుతున్న కష్టాలు కళ్లారా చూశారు. మట్టిలో రెక్కలు ముక్కలు చేసుకుంటూ ఎందరికో అన్నం పెట్టే అన్నదాతలకు ఆర్థికంగా చేయుత అందించాలని తపించారు. 2014 ఎన్నికలకు ముందు రైతు రుణమాఫీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించి మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టారు. రైతుల మోమున చిరునవ్వులు చూశారు.

రూ.2,475 కోట్ల రుణమాఫీ

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రూ.1.50 లక్షల లోపు రైతు రుణమాఫీ చేసే ఫైలుపై తొలి సంతకం చేశారు. రూ.50 వేల లోపు ఏకమొత్తంలో మాఫీ చేసి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2.19 లక్షల మంది రైతుల అప్పులు దాదాపు రూ.775 కోట్లు బ్యాంకులకు చెల్లించి రుణ విముక్తుల్ని చేశారు. రూ.1.50 లక్షల వరకు పది శాతం వడ్డీతో కలిపి 4.31 లక్షల మంది రైతులకు నాలుగైదు విడతల్లో రూ.1,713.40 కోట్లు రుణమాఫీ చేసింది. అంటే.. గత చంద్రబాబు ప్రభుత్వలో రైతు రుణమాఫీ పథకం కింద 6.50 లక్షల మంది రైతులు రూ.2,475 కోట్లు మాఫీ రూపంలో ఆర్థిక ప్రయోజనం పొందారు.

కోతలు.. రైతులకు వాతలు

గత ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం విజయం సాధించి ఉంటే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన కింద ఇచ్చే రూ.6 వేలు కాదని అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.10 వేల చొప్పున 7.31 లక్షల మందికి ఏటా రూ.731 కోట్ల పెట్టుబడి ఆర్థిక సాయం అందేది. ఆ పథకం స్థానంలో సీఎం జగన్ వైఎస్ఆర్ రైతు భరోసా పథకం తీసుకొచ్చినా సిక్స్ స్టెప్స్ నిబంధనలు పేరుతో కోతలు పెట్టారు. 2019 ఫిబ్రవరిలో 7.31 లక్షల మంది పెట్టుబడి సాయం కోసం అర్హులైన రైతులు ఉన్నారని నాటి టీడీపీ ప్రభుత్వం గుర్తించింది. సీఎం జగన్ వచ్చాక నిబంధనల పేరిట ఉమ్మడి జిల్లాలో 5.05 లక్షల మంది రైతులను మాత్రమే అర్హులుగా గుర్తించారు. కేంద్ర ఇచ్చే రూ.6 వేలు కాదని.. వైసీపీ ప్రభుత్వం రూ.7.500 ప్రకారం ఏటా రూ.379 కోట్లు మాత్రమే రైతుల ఖాతాలో జమ చేస్తుందని వ్యవసాయ అధికారులే అంటున్నారు. ఈ మొత్తాన్ని కూడా మూడు విడతల్లో జమ చేస్తున్నారు. 2.50 లక్షల మంది రైతులకు కోత కోసి రైతు భరోసా అందని ద్రాక్షగా మార్చేశారు. ఇది రైతులను దగా చేయడం కాదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ వస్తే అన్నదాత పేరిట రూ.20 వేలు

ప్రతి పక్ష నేత చంద్రబాబు సూపర్ సిక్స్ (ఆరు వరాలు) ప్రకటించారు. అందులో ఒకటి 'అన్నదాత పథకం'. ఈ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తారు. ప్రస్తుతం జగన్ ప్రభుత్వం ఇస్తున్న రూ.7,500 కంటే రూ.12,500 ఎక్కువ ఇస్తారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితే.. ఇప్పుడు అర్హులుగా గుర్తించిన 5.05 లక్షల మంది రైతులకు రూ.1,010 కోట్ల ప్రయోజనం కలగనుంది. అదే.. 7.31 లక్షల మంది రైతులకైతే రూ.1,460 కోట్లు పెట్టుబడి సాయం కింద ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఇది రైతులకు నిజమైన వరం అని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

అన్నదాతా సుఖీభవకు శ్రీకారం చుడితే..!

గత ప్రభుత్వంలో అన్నదాతా సుఖీభవ పథకానికి శ్రీకారం చుట్టారు. 2019 ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పచ్చజెండా ఊపారు. ఒక్కో రైతు కుటుంబానికి రూ.10 వేలు పెట్టుబడి సాయం అందించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు.. ఉమ్మడి జిల్లాలో 7.31 లక్షల మంది రైతులకు రూ.731 కోట్ల నిధులు అవసరం అవుతాయని అంచనా వేశారు. అదే ఏడాది జూన్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్‌లోగా రైతుల ఖాతాలో జమ చేసేందుకు ఆనాటి టీడీపీ ప్రభుత్వం సన్నాహాలు చేసింది. అయితే.. ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. వైసీపీ విజయం సాధించి మే 30న సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టారు. చంద్రబాబు మంత్రి వర్గం ఆమోదం తెలిపిన అన్నదాత సుఖీభవ పథకానికి తెర పడింది. అయితే.. అదే ఏడాది జూలైలో కడప జిల్లా జమ్మలమడుగులో జరిగిన రైతు దినోత్సవంలో వైఎస్ఆర్ రైతు భరోసా పథకానికి జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

రైతు భరోసా అరకొరనే



వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.13,500 మూడు విడుతల్లో ఇస్తుంది. అందులో కేంద్రం రూ.6 వేలు ఇస్తే.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది రూ.7,500లే. అదే చంద్రబాబు ప్రభుత్వంలో మాకు రూ.50 వేలు రుణమాఫీ చేసింది. ఒక్కసారిగా రుణం తీరిపోవడంతో ఆర్థిక కష్టాల నుంచి బయటపడ్డాం.

- కుడ్లూరు ఈరప్ప, హొళగుంద

రూ.50 వేలు రుణమాఫీ చేశారు



మాకు మూడు ఎకరాల పొలం ఉంది. వానొస్తేనే పంటలు పండేది. వర్షాభావం వల్ల రూ.50 వేల బ్యాంకు రుణం కట్టలేని పరిస్థితి ఉండేది. 2014లో సీఎం బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు మాఫీ చేసి రుణ విముక్తి కల్పించారు. 2019లో జగన్ వచ్చాక రైతు భరోసా కింద నాకు ఐదేళ్లలో వచ్చింది రూ.30 వేలే. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు వస్తే అన్నదాత పథకం కింద రూ.20 వేలు ఇస్తే రైతులకు కొండంత భరోసా కలుగుతుంది.

- గువ్వల తాయప్ప, రైతు, మాలపల్లి, మంత్రాలయం మండలం

ఇసుక దందా కనిపించడం లేదా..?

- కేంద్ర పర్యావరణ శాఖ నివేదికపై ఏమంటారు...?
- బీటీ నాయుడు, మల్లెల రాజశేఖరగౌడ్



సమవేశంలో మాట్లాడుతున్న బీటీ, మల్లెల

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 22: జగన్‌రెడ్డి ఇసుక దందా కలెక్టర్లకు కనిపించడం లేదా? అని కర్నూలు, నంద్యాల జిల్లాల టీడీపీ అధ్యక్షులు బీటీ నాయుడు, మల్లెల రాజశేఖరగౌడ్ ప్రశ్నించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీటీ నాయుడు మాట్లాడుతూ ఎన్జీటీ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) ఎంఓఈఎఫ్ అధికారులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశీలించారని, భారీ యంత్రాలతో ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తున్నట్లు తేల్చారని అన్నారు. అక్రమ తవ్వకాల ఫొటోలు, నకిలీ బిల్లు పుస్తకాలు మొదలైన అధారాలును కమిటీ సేకరించిందని అన్నారు. దీనిపై సీఎం జగన్మోహన్‌రెడ్డి ఏ మీ సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులు 500కు పైగా రీచ్‌ల్లో అక్రమంగా ఈసీలు లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని అన్నారు. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ నివేదికలో కీలక అంశాలు ఇసుక తవ్వకాల్లో పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయని అన్నాయి. రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ (సీయో) గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఇసుక తవ్వకాలకు కొత్తగా పర్యావరణ అనుమతులు(ఈసీ)జారీ చేయలేదని అన్నారు. అయినా భారీ యంత్రాలతో 24 గంటలు తవ్వేస్తూ ఒక్కో రీచ్ నుంచి వెయ్యి నుంచి 2వేల టన్నుల ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. చేతిరాతతో వేబిల్లులు ఇస్తున్నారని, కంప్యూటరైజ్డ్ బిల్లులు, సీసీ కెమెరాలు లేవని అన్నారు. రాష్ట్రంలో ఉన్న రీచ్‌ల వివరాలు అడిగితే గనుల శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని అన్నారు. . రోజుకు సగటున 2 వేల టన్నుల ఇసుక తవ్వి తీసి టన్ను రూ. 475కు విక్రయిస్తున్నారని తెలిపారు. మల్లెల రాజశేఖరగౌడ్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల్లో జరిగిన అక్రమాలు కేంద్ర ప్రభుత్వ సంస్థ మినిస్టరీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్టు అండ్ క్లైమేట్ చేంజ్ వారికి కనించినా కలెక్టర్లుకు కనిపంచకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పైగా కలెక్టర్లు అక్రమ మైనింగ్ జరగడం లేదని నివేదిక ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఇసుక దోచుకొని సంపాదించుకున్న డబ్బుతో ఎన్నికల్లో గెలవాలని జగన్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ నేతలు బొక్కిన ఇసుక కక్కిస్తామని హెచ్చరించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి

కలెక్టర్ డా.జి. సృజన

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: వారం రోజుల్లోపు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని కలెక్టర్ డా.జి. సృజన అధికారులను, సెక్టార్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో వల్నరబిలిటీ మ్యాపింగ్ అంశంపై సెక్టార్ అధికారులకు, సెక్టార్ పోలీసు అధికారులకు కలెక్టర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన మూడు రోజుల్లో వల్నరబిలిటీ మ్యాపింగ్ వివరాలు సమర్పించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు రూట్లు, మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అనే అంశంపైన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులు ఎక్కువ దృష్టి సారించాలని ఆదేశించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులు వల్నరబిలిటీ మ్యాపింగ్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించాక రిటర్నింగ్ అధికారులు, ఎస్‌డీపీవో, ఆర్డీవోలతో సమావేశం నిర్వహించుకుని ఏర్పాట్లపై తుది నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళి, హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ 4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామూనాయక్, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

వాము ధర పరుగులు

కర్ణాటక నుంచి కర్నూలు యార్డుకు క్యూ కడుతున్న రైతులు



కర్నూలు మార్కెట్ యార్డులో విక్రయానికి తెచ్చిన వాము

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 22: వాము ధరకు రెక్కలు వచ్చాయి. దీంతో కర్ణాటక రైతులు వాముతో కర్నూలు మార్కెట్ యార్డుకు క్యూ కడుతున్నారు. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డుకు దాదాపు 1,367 క్వింటాళ్ల వామును కర్ణాటక ప్రాంత రైతులు విక్రయానికి తెచ్చారు. క్వింటం గరిష్ఠ ధర రూ.28,010, మధ్యస్థ ధర రూ.19,019కు అమ్ముడుపోయింది. అదేవిధంగా బుధవారం కర్నూలు క్వింటం వేరుశనగ కాయల గరిష్ఠ ధర రూ.7,420, మధ్యస్థ ధర రూ.6,490, కనిష్ఠ ధర రూ.4,297 పలికిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, అదనపు సెక్రటరీలు రెహిమాన్, వెంకటేశ్వర్లు తెలిపారు. మొక్కజొన్నలకు కూడా మంచి ధర లభిస్తోంది. ప్రభుత్వ ధర రూ.2,250 కాగా, కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం గరిష్ఠ ధర రూ.2,225, మధ్యస్థ ధర రూ.2,210, కనిష్ఠ ధర రూ.1,939కు పలికింది. కందులకు గత వారం రూ.9వేలకు పైగానే ధర ఉంది. బుధవారం ఏకంగా గరిష్ఠ ధర రూ.10,021, మధ్యస్థ ధర రూ.9,996, కనిష్ఠ ధర రూ.1,080కు అమ్ముడుపోయింది. శనగలకు క్వింటానికి గరిష్ఠ ధర రూ.6,209, మధ్యస్థ ధర రూ.6,009, కనిష్ఠ ధర రూ.5,869 దక్కింది. ఉల్లిగడ్డల ధర గరిష్ఠంగా రూ.1,385, మధ్యస్థ ధర రూ.1,287, కనిష్ఠ ధర రూ.319కు అమ్ముడుపోయినట్లు సెక్రటరీ గోవిందు తెలిపారు. ఎండు మిరప కాయల ధర గరిష్ఠంగా రూ.18,199, మధ్యస్థ ధర రూ.15,513, కనిష్ఠ ధర రూ.2,599 రైతులకు అందినట్లు ఆయన తెలిపారు.

గన్‌మెన్ తొలగింపు అన్యాయం



తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, ఫిబ్రవరి 22: గన్‌మెన్‌ను తొలగించడం అన్యాయమని శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. గురువారం తుగ్గలిలో ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ నేపథ్యంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని ప్రభుత్వం గుర్తించి గత కొన్నేళ్లుగా గన్‌మెన్‌ను ఇచ్చిందని అన్నారు. అయితే.. గత నెలలో టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండటంతో వైసీపీ ప్రభుత్వం గనమెన్‌ను తొలగించిందని తెలిపారు. డోన్‌లో జరుగుతున్న ఓ వివాహ వేడుకల్లో ఉండగా తొలగింపు ఆర్డర్ వచ్చిందని గన్‌మెన్ వెళ్లిపోయాడని, అప్పుడు తన కుటుంబంతో మాత్రమే ఉన్నానని అలాంటపుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి గన్‌మెన్‌ను ఎందుకు తొలగించారని కోరగా టీడీపీలో చేరినందుకు గన్‌మెన్‌ను తొలగిస్తున్నామని చెప్పారని వివరించారు. తనకు ప్రాణహాని ఉండటం వల్ల గన్‌మెన్‌ను ఇచ్చారే తప్ప.. వైసీపీలో ఉన్నందుకు కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు.

శ్రీగిరిపై వైద్యశాల

- ధర్మకర్తల మండలి ఆమోదం
- అంచనా వ్యయం రూ. 19 కోట్లు
- తిరుమల తరహాలో స్వయం ప్రతిపత్తికి ప్రతిపాదన

శ్రీశైలం, ఫిబ్రవరి 22: శ్రీశైలం దేవస్థానంలో భక్తులు, స్థానికుల సౌకర్యార్థం రూ.19 కోట్లతో 30 పడకల వైద్యశాల నిర్మించాలని ధర్మకర్తల మండలి తీర్మానం చేసింది. ఆలయ కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఉప కార్యనిర్వహణాధికారి రవణమ్మ, వివిధ విభాగాల యూనిట్ అధికారులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన దేవస్థానం వేదపండితుడు జగన్నాథశర్మకు ఈ సమావేశం సంతాపం ప్రకటించింది. ఈ సమావేశంలో 50 అంశాలను ప్రవేశపెట్టగా వాటిలో 49 అంశాలకు ఆమోదం తెలిపి ఒక అంశాన్ని వాయిదా వేశారు. సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైలం దేవస్థానానికి కూడా స్వయం ప్రతిపత్తి కల్పించాలని దేవదాయశాఖ ప్రతిపాదన పంపాలని తీర్మానించినట్లు తెలిపారు. శ్రీశైలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకుని సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్.ఈ) పోస్టు ఏర్పాటుకు దేవదాయశాఖకు ప్రతిపాదన పంపనున్నట్లు తెలిపారు. దేవస్థానంలో నూతనంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కర్నూలు నగరంలోని దేవస్థానం సమాచార కేంద్రం వద్ద రూ.4.99 కోట్లతో కల్యాణ మండపం, రూ.3.70 కోట్లతో వాణిజ్య సముదాయం, నిర్మాణానికి తీర్మానం చేశామన్నారు. సుండిపెంటలో నిర్మిస్తున్న సిబ్బంది వసతి గృహాలకు రూ. 15 కోట్లతో నీటి సరఫరా ఏర్పాటు తదితర వాటికి ఆమోదం తెలిపామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఈవో

ఏసీబీకి చిక్కిన మార్కెట్ సూపర్‌వైజర్

- వ్యాపారి నుంచి రూ.15 వేలు డిమాండ్
- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు





ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో లంచం తీసుకుంటూ పట్టుబడిన సూపర్‌వైజర్ మహేశ్వరితో ఏసీబీ అధికారులు

ఎమ్మిగనూరు/టౌన్, ఫిబ్రవరి 22: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. కూరగాయల వ్యాపారి నుంచి మార్కెట్ సూపర్‌వైజర్ మహేశ్వరి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెగా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మూడో వార్డు వైసీపీ కౌన్సిలర్ స్వాతి భర్త వినయ్ అనే వ్యాపారి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఫ్రూట్స్, విజిటబుల్స్ హోల్‌సేల్ వ్యాపారం చేసుకునేందుకు ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం లైసెన్స్ ఫీజు రూ.5 వేలు చెల్లించినప్పటికీ రూ.15 వేలు లంచం ఇస్తేనే ట్రేడ్ లైసెన్స్ ఇస్తానని సూపర్ వైజర్ తెలిపింది. అయితే అంత మొత్తం ఇచ్చేందుకు ఇష్టం లేని సదరు వ్యాపారి వినయ్ బుధవారం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో వారు వివరాలను పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం మార్కెట్ కమిటీ కార్యాలయంలో వినయ్ నుంచి సూపర్ వైజర్ మహేశ్వరి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా అప్పటికే అక్కడ వేచి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. లంచం డబ్బును స్వాధీనం చేసుకొని సూపర్‌వైజర్ మహేశ్వరిని అదుపులోకి తీసుకున్నారు. కాగా మార్కెట్‌లో ఏసీబీ అధికారులు దాడులు చేయటం కలకలం రేపింది.

'అనంత'లో కదం తొక్కిన జర్నలిస్టులు

- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో 'చలో అనంతపురం'
- కర్నూలు జిల్లా నుంచి భారీగా తరలివెళ్లిన నాయకులు



అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు



అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న కర్నూలు జిల్లా నాయకులు



ధర్నాలో బైఠాయించిన జర్నలిస్టులు

అనంతపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి, ఇతర ప్రాంతాల్లో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై వైసీపీ దాడులను ఖండిస్తూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ గురువారం 'చలో అనంతపురం' కార్యక్రమాన్ని చేపట్టింది. అనంతపురం నగరంలోని సంగమేశ్వర సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు జర్నలిస్టు సంఘాల నాయకులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్‌కు స్పందించే తీరిక కూడా లేదా అని ఆ సంఘం నాయకులు ప్రశ్నించారు. సాక్షాత్తు సీఎం జగన్ సిద్ధం సభలోనే ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణా రహితంగా దాడి చేసి, చంపేందుకు ప్రయత్నించిన సంఘటనను ప్రజాస్వామిక వాదులందరూ ఖండించారని అన్నారు. అయినా ముఖ్యమంత్రిగాని, డీజీపీగాని ఇప్పటి దాకా నోరుమెదపకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులను నియంత్రించకపోతే 'చలో అనంతపురం'తో ఆగమని, తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు హెచ్చరించారు. ఈ నిరసనకు కర్నూలు, నంద్యాల జిల్లా నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలివచ్చారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ నాయకులు అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఐజేయూ జాతీయ ప్రధాన కార్యదర్శి సోమసుందర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కె. నాగరాజు, జి.కొండప్ప, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరి సుంకన్న, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అంజి, వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్నేహాల్ కార్యదర్శి కిరణ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు శివ, అవినాశ్, కోసి హనుమేష్, పత్తికొండ రాజేశ్, మద్దికెర వీరశేఖర్, ఎమ్మిగనూరు నూర్, ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షుడు శ్రీనివాస నాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, పట్టణాధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు



జర్నలిస్టుల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టం తేవాలి



రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి జగన్ నాయకత్వంలో జరిగిందనేది స్పష్టంగా అర్థమవుతోంది. ఆ సభలో ఆయన ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే ఈ దుర్మార్గమైన చర్యకు పాల్పడ్డారు. దాడి వీడియో చూస్తుంటే ప్రతిఒక్కరూ బాధపడ్డారు. ఐదేళ్లలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై దాడులు ఎక్కువయ్యాయి. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. గత ప్రభుత్వాల్లో ఎప్పుడూ జర్నలిస్టులపై దాడులు జరగలేదు. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో సిద్ధం సభ పెట్టి వారి మనుషులతో శ్రీకృష్ణను కిరాతకంగా కొట్టించారు. ఘటన జరిగిన ఐదు రోజులు గడుస్తున్నా జిల్లా పోలీసు యంత్రాంగం ఒక్కరినే అరెస్టు చేయడం చూస్తుంటే... వీరి వెనుక అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. వెంటనే జిల్లా ఎస్పీ ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించి దాడికి పాల్పడిన ప్రతిఒక్కరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకు రావాలి.

- రాజు, ఏపీయూడబ్ల్యూజే కర్నూలు జిల్లా అధ్యక్షుడు

జనన, మరణాలను సకాలంలో నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 22: జనన, మరణాలను సకాలంలో నమోదు చేసుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు రావని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో ధృవీకరణ పత్రాలు పొందడంలో ఎదురయ్యే సమస్యల గురించి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం మరణం, వివాహం, ఆదాయం, కులధృవీకరణ పత్రాలను పొందడం గురించి సంబంధిత అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, పారా లీగల్ వలంటీర్లు, ప్రసూన న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం సరిహద్దులు దాటరాదు

బళ్లారిలో అంతర్రాష్ట్ర ఎక్సైజ్ సమీక్ష

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 22: మద్యాన్ని సరిహద్దులు దాటకుండా ఉమ్మడి కార్యాచరణతో పని చేయాలని హోస్పేట్ ఎక్సైజ్ కమిషనర్ శైలజ అన్నారు. గురువారం కర్నాటకలోని బళ్లారిలో ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో కర్నాటక, రాష్ట్ర సరిహద్దులోని కర్నూలు, అనంతపురం జిల్లాల ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్లు, సూపరింటెండెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మద్యం రవాణా ఎక్కడ నుంచి జరుగుతుంది? ఎలా నిరోధించాలనే అంశాలపై చర్చించారు. ఉమ్మడిగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఇరు రాష్ట్రాల సిబ్బంది అందులో ఉంటూ ఎన్నికల సమయాన మద్యం రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రెండు జిల్లాల్లో నాలుగు చెక్‌పోస్టులు ఉండగా రాయదుర్గం, ఆలూరు, ఆదోని, కోసిగిల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించేందుకు ఇరు రాష్ట్రాల అధికారులు ఒక ఒప్పందానికి వచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి ఎక్సైజ్ కమిషనర్ వివేక్‌యాదవ్, సూపరింటెండెంట్ ఎం. సుధీర్ బాబు, సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించండి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: జిల్లాలో ఇంటర్మీడియట్, పదో తరగతి, డీఎస్సీ టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం పదో తరగతి, ఇంటర్మీడియట్, టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీలు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియం నుండి కలెక్టర్ డా.జి. సృజన, ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి విద్యాశాఖ అధికారి శ్యాముల్, ఆర్ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో జమీర్ పాషా, ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించామని, మళ్లీ అనుబంధ శాఖలతో కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించి జిల్లాలో పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించే సమయంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

విజయవాడలో డీసీసీ అధ్యక్షుడి అరెస్టు



నరసింహను బలవంతంగా స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 22 : విజయవాడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఛలో సెక్రటేరియేట్‌ను భగ్నం చేసేందుకు అక్కడి పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారు. ఛలో సెక్రటేరియేట్‌కు వెళ్లిన నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జె. లక్ష్మీనరసింహ యాదవ్‌ను అరెస్టు చేశారు. గురువారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేతృత్వంలో ఛలో సెక్రటేరియేట్‌ను అడ్డుకునేందుకు ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించింది. ఈ ముట్టడిలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహను బలవంతంగా స్పెషల్ పార్టీ పోలీసులు అరెస్టు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 52 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తే ఆయన వారసుడిగా చెప్పుకునే జగన్ కేవలం 6 వేల పోస్టులతో ఇచ్చిన నోటిఫికేషన్ దగా డీఎస్సీ అని నరసింహ ధ్వజమెత్తారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని దగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని ఆయన అన్నారు. టెట్, డీఎస్సీ కలిపి నోటిఫికేషన్ ఇస్తే అభ్యర్థులు దేనికి సన్నద్ధం కావాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హుసేన్‌బాషా, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షంషూల్‌హక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ ప్రేరేపిత ఉగ్రవాదం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



మాట్లాడుతున్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 22: రాష్ట్రంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదం నడుస్తోందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పాణ్యం నియోజకవర్గం ఇన్‌చార్జి గౌరు చరితారెడ్డితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ ఈనాడు కార్యాలయంపై దాడి జరిగిన వెంటనే కాటసాని తాడేపల్లి నుంచి పిలుపు అందుకొని పరుగులు తీసి అక్కడ అక్షింతలు వేయించుకున్నారని అన్నారు. తన అవినీతి ఆరోపణలు కప్పిపుచ్చుకునేందుకు తాడేపల్లిలో తనకూ ఈనాడు మీద దాడికి ఎలాంటి సంబంధం లేదని కాటసాని చెప్పడం సిగ్గుచేటన్నారు. తాను అక్రమాలు, భూదందాలు చేయలేదనే దానిపై బహిరంగ చర్చకుకాటసాని రాంభూపాల్‌రెడ్డి సిద్ధమా? అని గౌరు చరితారెడ్డి సవాలు విసిరారు. కాటసాని అక్రమాలపై వచ్చిన వార్తలపై ఖండించుకోలేక నగరం నడిబొడ్డున ఉన్న ఈనాడు కార్యాలయంపై కాటసాని అనుచరులు, వైసీపీ మూకలు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఈ దాడికి కాటసాని తన అనుచరులను ప్రోత్సహించిన మాట వాస్తవం కాదా? అని అన్నారు. ఆయన అవినీతి గురించి తమ వద్ద అన్ని ఆధారాలున్నాయని, అవసరమైతే ఆయన ఇంటికి వెళ్లి చర్చించేందుకు తాము సిద్ధమని అన్నారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ కాటసాని అక్రమాల గురించి ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో ఏ చిన్న పిల్లవాడిని అడినా చెబుతారని అన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిని వేధిస్తున్నారని అన్నారు. మీడియాపై దాడులకు ప్రోత్సహిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఏ-1గా, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీదేవిలను ఏ2, ఏ3గా 307 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభాకర్ యాదవ్, మాదేసు, సుధాకర్‌రెడ్డి, జేమ్స్, పాల్గొన్నారు.

రైతుల జీవితాలతో చెలగాటం వద్దు

సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 22 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జస్టిస్ స్వామినాథన్‌కు భారతరత్న అవార్డు ఇస్తూ మరో వైపు స్వామినాథన్ కమిషన్ రిపోర్టు అమలు కోసం పోరాడుతున్న రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం నంద్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బొజ్జా మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ రిపోర్టులోని కీలకమైన వ్యవసాయ ఉత్పాదనలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని 2014 ఎన్నికల ప్రణాళికలో బీజేపీ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కనీస మద్దతు ధర అమలు చేస్తామని ప్రకటించి పదేళ్లు అయినా హామీని బీజేపీ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర వైఖరిని ప్రశ్నిస్తున్న రైతులపై దాడులకు దిగడం దారుణమని అన్నారు. యావత్ భారత దేశ రైతుల హక్కుల కోసం పోరాడుతున్న పంజాబ్ రైతులపై పోలీసు బలగాలతో కేంద్ర ప్రభుత్వం దాడులు చేయించడం, అందులో యువ రైతు మరణించడం బాధాకరమని అన్నారు. రైతాంగ హక్కుల కోసం పోరాటంలో చనిపోయిన రైతుకు నివాళులర్పిస్తున్నామని అన్నారు. రైతులపై దాడులు ఆపి రైతుల న్యాయమైన వ్యవసాయ ఉత్పాదనలకు కనీస మద్దతు ధర కల్పించేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సాగునీటి సాధన సమితి ప్రతినిధులు న్యాయవాది కృష్ణారెడ్డి, నందిగం హుసేనయ్య, సౌదాగర్ కాశీమియ్య, నెట్టూరి సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి గురు వైభవోత్సవాలు

12న రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం



మంత్రాలయం, ఫిబ్రవరి 22: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు మార్చి 11 నుంచి 16వ తేదీ వరకు ఆరు రోజులు వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. గురువారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో 403వ రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం, 429వ రాఘవేంద్రస్వామి పుట్టినరోజు వేడుకల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 12న రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేక మహోత్సవం, 16వ తేదీన రాఘవేంద్రస్వామి 429 జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరు రోజుల పాటు జరిగే వేడుకల్లో రాఘవేంద్రస్వామి బంగారు పాదుకలను బంగారు సింహాసనంపై ఉంచి ముత్యాలు, బంగారు నాణేలు, పుష్పాలతో అభిషేకం చేయనున్నారు. ఈ వేడుకల్లో భాగంగా బంగారు రథంపై స్వామివారిని ఊరేగించనున్నారు. యోగీంద్ర కళా మండపంలో ప్రముఖులకు గురు వైభోత్సవ అవార్డుల ప్రదానం, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శన, దాసవాణి ఉంటాయి. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి ఉపాధ్యాయుడి తొలగింపు

కర్నూలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండలం డేగలహాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయుడిగా పని చేసున్న వి.బాలాజీని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ గురువారం ప్రభుత్వం డబ్ల్యూ నెం.8 కింద గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2018 డిసెంబరు 19 నుంచి విధులకు నిరంతరంగా గైర్హాజరు అవుతుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సంబంధిత ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖ అధికారికి పంపించారు.

డోన్‌లో విద్యార్థిని ఆత్మహత్య

డోన్(రూరల్), ఫిబ్రవరి 16: డోన్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. రాత్రిపూట ఇంట్లో సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తుందని తల్లిదండ్రులు మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఉరి వేసుకున్నదని తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



కొత్తూరులో తాగునీటి కుంటను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 22: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం రాత్రి కొత్తూరు గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు, మహిళ లు సమస్యలపై టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నామని, మరికొందరు విధి లేక కుంటలోని బురదనీటిని తాగుతున్నామని వాపోయారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవని చెప్పారు.

● **తాగునీరు అందించకపోవడం దారుణం:** కొత్తూరు గ్రామస్థులకు తాగునీరు అందించలేకపోవడం దారుణమని టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. గ్రామస్థుల విన్నపం మేరకు కుంటను పరిశీలించారు. కుంటలో అడుగంటిన బురదనీటినే తాగుతున్నామని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకరాగా, వైసీపీ తాగునీరు కూడా అందించలేని దద్దమ్మ ప్రభుత్వమని మండిపడ్డారు. కార్యక్రమంలో రఘుపతి, నారాయణ చౌదరి, కమలాకర్, పరమేశ్వరయ్య, ఉదయ్‌కిరణ్, నాగరాజు, శ్రీనివాసులు, రమణ, కాంత, పట్టెక్రిష్ణ, నాగలాపురం సురేష్, ప్యాలకుర్తి షేక్ షావలి, జీపు క్రిష్ణ, రామాంజనేయులు, అశోక్, గడ్డమయ్య, మద్దూరు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 22: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి రూ.10వేల జరిమానా విధించామని సెబ్ సీఐ కేఆర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం స్పెషల్ ఎన్ ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు సెబ్, సుంకేసుల చెక్ పోస్టు సిబ్బంది సంయుక్తంగా ఈ.తాండ్రపాడు, సుంకేసుల గ్రామాల్లో అక్రమ మద్యం, ఇసుక రవాణాపై దాడులు నిర్వహించారు. 54 మద్యం బాటిళ్లు సీజ్ చేసి వ్యక్తులపై కేసులు నమోదు చేశామని, స్టాంటన్‌పురం వద్ద మద్దిలేటి అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండంతో సీజ్ చేసి జరిమానా విధించామని తెలిపారు. ఈదాడుల్లో ఎస్ఐలు రెహేనా, జీ మారుతీ ప్రసాద్, ఎం.మల్లిక, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి అమర్నాథ్‌కు మతి భ్రమించింది

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 22: ఐటీ శాఖ మంత్రి అమర్నాథ్‌కు మతి భ్రమించి మాట్లాడుతున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ తనకు సీటు ఇచ్చే అవకాశం లేకపోవడంతో చంద్రబాబు, లోకేశ్‌లను తిడితే కనీసం జగన్మోన్ రెడ్డి దృష్టిలో పడాలని తాపత్రాయం పడుతున్నాడన్నారు. లోకేష్ కు కుండలో అన్నం వండి పంపిస్తాను అంటావా.. గుడివాడ అమర్నాథ్ జూన్ నెలాఖరు వరకు ఓపిక పట్టు వైజాగ్ రామక్రిష్ణ బీచ్‌లో ఆ కుండలు పెట్టుకొని అన్నం, పప్పు ఇంకా నీవు చెప్పే రకరకాలు చేసి అమ్ముకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆదర్శప్రాయం'

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 22: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమని మాజీ ఎంఎల్‌ఏ ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. గురువారం ఉయ్యాలవాడ నరసిం హారెడ్డి 177వ వర్ధంతిని నగరంలో ఏ.క్యాంపులోగల సప్తగిరి సర్కిల్‌లో, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్కిల్‌లోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్ర హానికి పుష్పమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు బి.విజయ మోహన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, ఏ క్యాంపు అసోసియేషన్ నాయకులు జోగి వెంకటరామిరెడ్డి, నాయ కులు ఎంవీ రమణారెడ్డి, జి.సుబ్బారెడ్డి, ఎన్.నరసింహారెడ్డి, వై. దివాకర్‌రెడ్డి, ఆర్.నాగార్జునరెడ్డి, హనుమంతరెడ్డి, హేమలత, బీరు ప్రతాపరెడ్డి, జితేంద్ర, జి.రామచంద్రారెడ్డి, తిలక్, ప్రతాప్, బి.సహదేవరెడ్డి, దీప, అపర్ణ, పి.సువర్ణరెడ్డి పాల్గొన్నారు. సామాజిక సేవలు అందిస్తు న్న డాక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవికళాధర్‌రెడ్డి, అజీజ్, శకుంతల, పి.నరసింహారెడ్డి, నాగేశ్వరరెడ్డిలను సత్కరించారు.

కళాకారులకు సత్కారం



సత్కారం అందుకున్న 'సైరా నరసింహారెడ్డి' నాటకంలోని కళాకారులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 22: కర్నూలుకు చెందిన తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రను నాటకంగా ప్రదర్శించిన టీజీవీ కళాక్షేత్రం కళాకారులను కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఘనం గా సత్కరించారు. గురువారం సాయం త్రం కళాక్షేత్రంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి కళాకారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ 1857 మొదటి స్వాతంత్ర్య ఉద్యమానికి పదేళ్ల ముందే బ్రిటీమ వారిపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన తెలుగు వీరుడు ఉయ్యాలవాడ అని కొనియాడారు. ఆయన జీవిత గాథను 1980వ దశకంలోనే నాటకంగా రూపొం దించి ఇప్పటి వరకు 150కి పైగా ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ నాటకం నంది నాటక పోటీల్లోనూ వెండి నంది బహుమతిగా సాధించిందని గుర్తు చేశారు. నంది నాటక పోటీల్లో 'సైరా నరసింహారెడ్డి' నాటకాన్ని ప్రదర్శించిన నాటి కళాకారులు మహ్మద్‌మియా, కేబాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజ నేయులు, లక్ష్మీకాంతరావు, క్రిష్టఫర్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రచయిత ఎస్‌డీవీ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

'అయోధ్య శ్రీరాముని దర్శనం పూర్వజన్మ సుకృతం'



క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న నగరూరు రాఘవేంద్ర తదితరులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 22: అయోధ్యలో శ్రీరాముని దర్శనం పూర్వజన్మ సుకృతమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. ఇటీవల కర్నూలు నుంచి అయోధ్య రామాలయ దర్శనానికి వెళ్లిన భక్తులు గురువారం రాత్రి కర్నూలుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ, భజరంగదళ్ నాయకులు వారికి స్వాగతం పలికి భారత ప్రధాని చిత్రపటాలతో ముద్రించిన బీజేపీ క్యాలెండర్లను భక్తులకు అందజేశారు. రాఘవేంద్ర మాట్లాడుతూ అయోధ్య రాముని దర్శించుకుని వచ్చిన భక్తులతో మాట్లాడటం, అక్కడి విశేషాలను వారితో పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో భజరం గదళ్ రాష్ట్ర కన్వీనర్ పి.ప్రతాప్‌రెడ్డి, బీజేపీ నాయకులు గోరంట్ల రామాం జనేయులు, అమర్నాథ్ పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత

కల్లూరు, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్‌లో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని టీడీపీ మేనిఫెస్టోను పంపిణీ చేశారు. 2024 ఎన్నికల్లో మహిళా సాధికారతకు మాజీ సీఎం చంద్రబాబు ఆరు సరికొత్త పథకాలను ప్రవేశపెట్టారని వివరించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ వార్డుల కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, టీడీపీ నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, ప్రభాకర్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, పుల్లయ్యగౌడ్, శ్రీనివాసరావు, పాణ్యం తెలుగు యువత అధ్యక్షుడు జె.గంగాధర్ గౌడ్ జనసేన నాయకుడు షబ్బీర్ పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరిక:** కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్‌కు చెందిన పలువురు గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు. గురువారం వార్డు పర్యటనలో భాగంగా టీడీపీ అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో చేరిన యువతకు గౌరు చరిత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీసీలో చేరిన వారిలో శివ, లక్ష్మీనారాయణ, సీతారామ్, మధు, రామయ్య, హరి, ప్రసాద్, కిరణ్‌కుమార్, భాషా, శివుడు, పుష్పలత, దేవమ్మ, ఏసన్న, శాలుబాషా ఉన్నారు.



టీడీపీలో చేరిన వారితో గౌరు చరిత

దేశాల మధ్య సమైక్యత అవసరం

» కేవీఆర్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 22: ప్రపంచ దేశాల మధ్య సమైక్యత అవసరమని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం కేవీఆర్ డిగ్రీ మహిళా కళాశాలలో పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల మధ్య ఎడతెరపి లేకుండా జరుగుతున్న పోరా టం సమస్యలకు పరిష్కారం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దేశాల మధ్య సర్దుబాటు లేకపోతే ప్రజలు అన్ని విధాల నష్టపోతారని. దేశాభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. దీనిపై డాక్టర్ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉర్దూ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఫజలూర్ రహమన్ మాట్లాడుతూ సాంఘిక, రాజకీయ భావజాల స్వేచ్ఛ కాపాడుకునే దిశగా ప్రజలు, ప్రభు త్వాలు ఆలోచిస్తే అంతర్యుద్ధాలు ఉండవన్నారు. శాంతియుతమైన పరి ష్కారాలు దేశాల మధ్య తప్పక చేసుకోవాలన్నారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సమీయుద్దీన్ ముజిమ్మిల్ మాట్లాడుతూ వంద ఏళ్లగా సాగుతున్న పాలస్తీనా, ఇజ్రాయేల్ గొడవలకు పరిష్కారం మేధావులు కనుగొన్నాల ని అన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్స్ వీవీఎస్ కుమార్, నజాయత్తు, ఎస్. మహబూబ్ బాషా, మణికంఠ, డాక్టర్ సునీత, జి.జోతిర్మయి, సైకాల జీస్టు డాక్టర్ అక్తర్ భాను, పార్వతి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సమష్టిగా ముందుకు సాగాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



ప్రసంగిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 22: ఆర్యవైశ్యులు సమష్టిగా ముందుకు సాగాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని హోటల్ మౌర్య ఇన్ విభు, ఆర్య ఫంక్షన్ హాల్లో ఆవోపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి టీజీ వెంకటేశ్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు రాజ్యాంగపరంగా ఎలాంటి హక్కులు లేవని, ప్రభుత్వాల నుంచి సహాయ సహకారాలు అందడం లేదని అన్నారు. విదేశాల్లో ఉన్న ఆర్యవైశ్యులకు ఎలాంటి సమస్యలు వచ్చినా ఆదుకోవడానికి ప్రపంచ ఆర్యవైశ్య మహాసభను ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పారిశ్రా మికవేత్త టీజీ శివరాజ్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య మహాసభ, ఆవోపా సంస్థలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

సి.బెళగల్, ఫిబ్రవరి 22: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో శ్రీరాముల ఆలయ నిర్మాణానికి గామపెద్దలు భూమి పూజ చేశారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామపెద్దలంతా సమావేశమయ్యారు. ఆలయం పక్కన ఉన్న సయ్యద్ టైలర్ అల్లబకాష్ భార్య బేతుంబీ, తిమ్మారెడ్డి భార్య తులసమ్మను గ్రామస్థులు కలిసి ఆలయ నిర్మాణానికి స్థలం ఇవ్వాలని కోరారు. దీంతో వారిద్దరూ 5 సెంట్లు స్థలాన్ని ఇవ్వడంతో గురువారం ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

మెనూ పాటించాలి: డీఈవో



పాఠశాలలో తనిఖీ చేస్తున్న డీఈవో శ్యామూల్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 22: జిల్లాలో మధ్యాహ్న భోజనంలో ఖచ్చితంగా మెనూ పాటించాల్సిందేనని, అలా పాటించని వంట ఏజెన్సీలపై చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి కె.శ్యామూల్ హెచ్చరించారు. మెనూ అమలయ్యేలా చూడాల్సిందేనని బాధ్యత సంబంధిత ప్రధానోపాధ్యాయులదేనని అన్నారు. నగరంలోని ఐజీఎంఎం పాఠశాలల విద్యార్థులు గురువారం ప్లేట్లను పట్టుకుని కలెక్టర్‌ను కలిసి ఎండీఎం నాణ్యత సరిగ్గా లేదంటూ ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణ చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో డీఈవో విచారణ చేసి సదురు ఏజెన్సీపై చర్యలు ఉపక్రమించారు. పాఠశాల హెచ్ఎంకు చార్జి మెమో జారీ చేసి విచారణకు ఆదేశించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 22: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ శివనాగలీల అన్నారు. 137 కర్నూలు నియోజకవర్గ పరిధిలోని కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు ఎస్‌బీఐ కాలనీలోని కౌన్సిల్ హాలులో గురువారం ఓటు హక్కు వినియోగంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధానత్య, వినియోగించుకునే విధానం అంశాలపై ఆమె వివరించారు. విద్యార్థులు, అధ్యాపకుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ రమణ, పట్టణ ప్రణాళిక సూపరింటెండెంట్ సుబ్బన్న, అనంత్ వెంకటేష్, రాహు ల్‌సింగ్, నవీన్, రాజు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలు జాగ్రత్త

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 22: సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలు జాగ్రత్తగా జాతికి మేలు చేసే పార్టీకి మద్దతు పలుకుదామని తీర్మానించారు. గురువారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మాదిగలు ఎటువైపు అనే అం శంపై సదస్సు జరిగింది. ఈసందర్భంగా రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతర రత్నం మాదిగ మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకునే పార్టీలను చిత్తుగా ఓడించకపోతే రాబోయే కాలంలో దళిత మహిళలపై దాడులు, అత్యాచారాలు పాలు చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు మాదిగల కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని చెబుతూ ఓట్లు దండుకుని న్యాయం చేయడం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో డేవిడ్ మాదిగ, రెపల్లె ప్రతాప్, ఎన్ సోమసుందర్, బొరెల్లి విరన్న, పాస్టర్లు పాల్గొన్నారు.

తైక్వాండోతో ఆత్మ రక్షణ

కర్నూలు(ఎడ్యుకేషన్) ఫిబ్రవరి 22: విద్యార్థుల ఆత్మ రక్షణ కోసం తైక్వాండో ఎంతో ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ హృదయస్వామి అన్నారు. గురు వారం స్థానిక బళ్ళారి రోడ్డులోని సెయింట్ క్లారెట్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ హృదయస్వామి తైక్వాండో బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. పాఠశాలలో 60 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని వివరించారు. అందుకు కృషి చేస్తున్న మాస్టార్ వెంకటేష్‌ను ఆయన అభినందించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 22: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో శకుంతల సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో శకుంతల మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయతీలలో వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులదే బాధ్యత అని అన్నారు. అనంతరం మండల పశువైద్యాధికారి ప్రవీన్ మాట్లాడుతూ గ్రామాల్లో పాడి పశువులకు, గొర్రెల, మేకలకు వచ్చే తెగుళ్ల నివారణపై ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. ఈవోఆర్డీ సందీప్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ఇంటి, కొళాయి పన్నులు వసూలు చేయా లన్నారు. వేసవి కాలం ముగిసేవరకు కొత్త కొళాయి కనెక్షన్లు ఇవ్వరాదు అన్నారు. అనుమతి లేని కొళాయిలను రద్దు చేయాలన్నారు. చింతమాను పల్లె నుంచి సిబెళగల్, బ్రాహ్మణదొడ్డి, ఇనగండ్ల నుంచి కొండాపురం వరకు రోడ్లు వేయించాలని సర్పంచులు అధికారులను కోరారు. హౌసింగ్ ఏఈ సుమంత్ మాట్లాడుతూ మండలంలోని కంబందహాల్, బురాన్‌దొడ్డి, సిబెళ గల్, కొండాపురం, ముడుమాల, ఇనగండ్ల గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. మండల విద్యాధికారి జ్యోతి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు హాజరు శాతం తగ్గకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించామన్నారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరిస్తా



ఉపకులపతిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్స్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 22: జిల్లాలోని డిగ్రీ కళాశాలల సమస్యలను పరిష్కరిస్తానని ఉపకులపతి సుధీర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలోని సెమినార్ హాలులో జిల్లాలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఆత్మీయ సమ్మేళనం కార్యక్ర మం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 కంటే ముందు చేరి కోర్సు పూర్తి చేసుకోలేకపోయిన విద్యార్థులందరికీ చివరి అవకాశంగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ అంకన్న, డీన్‌లు క్రిష్ణారెడ్డి, సుందరానందపుచ్చా, పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుకాణాలకు బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 22: నగర పాలక సంస్థ పరిధిలోని కింగ్‌మార్కెట్, శ్రీనివాస థియేటర్ వద్ద దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. గురువారం పాతకౌన్సిల్ హాలులో మేనేజర్ చిన్నరాముడు పర్యవేక్షణలో నాలుగు దుకాణాలకు వేలం నిర్వహించారు. గుడ్‌విల్ రూ.8,96,000, సెక్యూరిటీ డిపాజిట్ రూ.62500లతో మొత్తం రూ.9,58,800 కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరింది. ఈ వేలంలో రెవెన్యూ ఆఫీసర్ జునైద్, సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ఆర్ఐలు సొహైల్, వాజిద్, సాజిద్, ఖలీల్, మన్సూర్ పాల్గొన్నారు.

సమాజం మెచ్చేలా వైద్య సేవలుండాలి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 22: సమాజం మెచ్చేలా వైద్య సేవలుం డాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్, ఏపీ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ సభ్యుడు డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు పెంచికలపాడు విశ్వ భారతి మెడికల్ కళాశాల, నంద్యాల శాంతిరాం మెడికల్ కాలేజీలో వైద్యవిద్యను పూర్తి చేసుకున్న వైద్యులకు ఏపీ మెడికల్ కౌన్సిల్ కమిటీ ఆధ్వర్యంలో మెడికల్ ఎథిక్స్‌పై ఆయన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సేవలు అందించాలన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీల్లో కర్నూలు క్రీడాకారుల సత్తా

అభినందించిన కలెక్టర్ జి.సృజన



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 22: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో కర్నూలు క్రీడాకారులు సత్తా చాటారు. వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడల్లో 2, 3 స్థానాలను సాధించారు. క్రీడాకారులు, డీఎస్‌డీవో శ్రీనివాసరావును కలెక్టర్ జి.సృజన అభినందించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రీడలలో బాలికలు, వాలీబాల్ క్రీడలో రాష్ట్రంలో రెండో స్థానం, షటిల్ బ్యాడ్మింటన్‌లో మూడో స్థానం సాధించారు. బాలుర కబడ్డీ పోటీల్లో మూడో స్థానం సాధిం చడంతో కలెక్టర్ డా.జి.సృజన అభినందించారు. వారు సాధించిన ట్రోఫీలు, మెడ ల్స్, సర్టిఫికెట్లను పరిశీలించి అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈవో రమణ పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు



హంద్రీలో గుర్రపు డెక్కను తొలగిస్తున్న సిబ్బంది

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 22: నగరంలో దోమలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలో దోమలను నియంత్రణకు గురువారం యాంటి వైరల్ ఆపరేషన్‌లో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొహరాపురం హంద్రీ నదిలో క్రేన్లు, తెప్పల సాయంతో గుర్రపు డెక్కను తొలగించామన్నారు. నదిలో పైరోసిన్ నూనెతో యాంటీ లార్వాల్ స్ప్రే, నది అంచులలో ఆయిల్ బాల్స్ విడుదల చేశామన్నారు. ఇటీవల ఇందిరమ్మ కాలనీలో డెంగీ కేసు నమోదు కావడంతో ఆ ఇంటిని పైరిత్రమ్ స్ప్రే చేయించి పీడీపీ లార్వా సర్వే విడుదల చేశామన్నారు.

చౌడేశ్వరిదేవి ఉత్సవాలు ప్రారంభం



కోడుమూరు, ఫిబ్రవరి 22: స్థానిక చౌడేశ్వరిదేవి ఉత్సవాలు నుంచి ప్రారం భమయ్యాయి. గురువారం గుమ్మటోత్సవంలో అమ్మవారి జాతర ఉత్సవాలు ప్రారంభించామని అటగార దేవాంగ దైవాచార సంఘం నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 23న ప్రభోత్సవం, 24న నంది ధ్వజశావ, 25న రథోత్సవం, 26న తిరుగు రథోత్సవం, 27న పారువేట, 28న వసంతోత్సవంతో జాతర ఉత్సవాలు ముగియనున్నాయి. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

ఎన్నికల వ్యయ నిర్వహణ సమావేశం

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: ఎన్నికల వ్యయ నిర్వహణ, మోడల్ ప్రవర్తనా నియమావళి సంబంధించిన అంశాలపై నేడు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు సమావేశం నిర్వహించనున్నారు. వీఎస్‌టీ, వీవీటీ, ఏఎల్‌ఎంటీ, ఎంసీసీ, ఈఎస్‌టీ, ఎస్ఎస్‌టీ సంబంధించిన వారికి శిక్షణ ఇవ్వనున్నారు. అదే విధంగా జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఛైర్మన్ కలెక్టర్ వ్యవహరించనున్నారు. ఎంసీఎంసీ కమిటీలో ఛైర్మన్‌తో పాటు ఆరుగురు సభ్యులు ఉంటారు. ఎంసీఎంసీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల అన్ని రకాల అడ్వైర్‌టైజ్‌మెంట్‌లను పర్యవేక్షించనున్నారు.

ఎర్రబస్సు ఎరగని యాపర్లపాడు

» అత్యవసరానికి కూడా గ్రామానికి రాలేని అంబులెన్స్
» ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

కల్లూరు, ఫిబ్రవరి 22: జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న యాపర్లపాడు గ్రామ ప్రజలు ఎర్రబస్సు ఎరగరు. ఈ గ్రామానికి ఇప్పటికీ రోడ్డు లేదు. ఉలిందకొండ నుంచి దాదాపు 3.7 కిలోమీటర్ల దూరంలో ఈ ఊరు ఉంది. ఈ ఊరికి ఆటోలు, బస్సులు రావు. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు రాకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకీడుస్తున్నామని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ ఊరేమన్నా అడవిలో ఉందా? జిల్లా కేంద్రానికి 22 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న తమ గ్రామానికి రోడ్డు వేయకుండా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తు న్నారు.

● **టెండరు దశలోనే:** ప్రజల ఆకాంక్ష మేరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో దాదాపు 368.99 లక్షల అంచనాతో రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్ ముందుకు వచ్చారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం యాపర్లపాడు గ్రామానికి రోడ్డు పనులు పూర్తి చేయించడంలో ఘోరంగా విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోపక్క పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు చొరవ చూపకపోవడంతో రోడ్డు పనులు జరకుండా పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



యాపర్లపాడు గ్రామానికి సగంలోనే ఆగిపోయిన రోడ్డు పనులు

మండుటెండలో నిరీక్షణ

- మూడు గంటలపాటు మహిళల ఎదురుచూపులు
- ఎమ్మెల్యే మెప్పు కోసం అధికారుల ఆజ్ఞ
- అధికారుల తీరుపై ప్రజా సంఘాల మండిపాటు
- పాలకులకు తొత్తులా వ్యవహరించొద్దంటూ హితవు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 22: భగభగ మండే ఎండలో పండుటాకులైన వృద్ధులు, మహిళలు మూడు గంటలపాటు వెలుగు కార్యాలయం ఎదుట పడిగాపులు కాచారు. వీరంతా ఎమ్మెల్యే సాయిప్రసాదరెడ్డి రాక కోసం నిరీక్షణ చేయాల్సి వచ్చింది. ఎమ్మెల్యే గారితో వీరికి ఎలాంటి సొంత పనిలేదు.. వెలుగు అధికారులు ఎమ్మెల్యే మెప్పు కోసం అర్బన్, రూరల్ పరిధిలో ఉండే పొదుపు మహిళలను పెద్ద ఎత్తున ఇక్కడికి తరలించారు. గురువారం ప్రభుత్వ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద నిర్వహించారు. సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున పొదుపు మహిళలపై ఒత్తిడి తెచ్చారు. ఈ కార్యక్రమానికి రాకపోతే ఇబ్బందులు తప్పవనడంతో 60ఏళ్లు దాటిన వృద్ధులు సైతం ఈ కార్యక్రమానికి ఉదయమే వచ్చారు. 10గంటలకు కార్యక్రమానికి రావాల్సిన ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మధ్యాహ్నం 1.30 గంటలకు వచ్చారు.. అప్పటి వరకు మహిళలు మండుటెండలో మగ్గాల్సి వచ్చింది. 'ఉదయం 10 గంటలకు వచ్చాం. ఎమ్మెల్యే సారు వస్తారని చెప్పారు. ఆకలి అవుతోందని ఇంటికి పోతామంటే అధికారులు కోప్పడుతున్నారు. నీరసంగా ఉంది' అంటూ వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు గంటల నుంచి ఇక్కడే కూర్చున్నాం. తాగునీరు లేదు. మరుగుదొడ్లు లేవు.. కనీసం కూసునేందుకు కూర్చీలు కూడా లేవు' అంటూ మహిళలు ఆంధ్రజ్యోతితో వాపోయారు. నిలువ నీడ లేకపోవడంతో కొందరు మహిళలు కార్యాలయం ఎదుట మెట్లపైనే కూర్చునాల్సి వచ్చింది. మరికొందరు మహిళలు ఎండలోనే నిలపడి ఎమ్మెల్యే రాక కోసం ఎదురు చూశారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే 1.30 గంటలకు కార్యాలయం చేరుకొని ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ స్పీచ్ ఇవ్వడంతో అక్కడే ఉన్న పలువురు ప్రజాసంఘాల నాయకులు అవాక్కయ్యారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. 'ఎమ్మెల్యే మెప్పు కోసం అధికారులు ఇలా మహిళలను, వృద్ధులను ఇబ్బంది పెట్టడం సరికాదు. అధికారులు ప్రజలకు సర్వెంట్లుగా పనిచేయాలని కానీ, ప్రజాప్రతినిధుల మెప్పు కోసం తొత్తులుగా వ్యవహరించరాదు' అంటూ ఘాటుగా విమర్శించారు.


మండుటెండలో ఎమ్మెల్యే రాక కోసం ఎదురు చూస్తున్న మహిళలు

నీటి నిలుపుదలపై అసత్య ప్రచారం

హొళగుంద, ఫిబ్రవరి 22: తుంగభద్ర దిగువ కాలువ ఎల్ఎల్‌సీకి బుధవారం రాత్రి తుంగభద్ర బోర్డు అధికారులు నీటి సరఫరా నిలిపివేశారని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మాతగేరి తప్పెట రామిరెడ్డి గురువారం తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, నీటి నిలుపుదల పై కేవలం కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. తాను తుంగభద్ర బోర్డు అధికారులతో మాట్లాడానని, తాగునీటి అవసరాల కోసం 15 రోజులకు పైగా నీటి సరఫరా జరుగుతుందని వారు తెలిపారని పేర్కొన్నారు.

మార్చి 3న పల్స్‌పోలియో

దేవనకొండ, ఫిబ్రవరి 22 : మార్చి 3న పల్స్‌పోలియో కార్యక్రమాని నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురాం రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆశ కార్యకర్తలు ,అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా వందశాతం చేయాలని సూచించారు. వైద్యాధికారులు విజయభాస్కర్ ,కళ్యాణ్ చంద్రశేకర్ ,సిహెచ్‌వో భాగ్యలక్ష్మి ,అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభాల ప్రతిష్ఠ

దేవనకొండ ,ఫిబ్రవరి 22: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో సీతారాముల దేవాలయం, ఉంజనేయస్వామి దేవాలయం, కాశీవిశ్వేశ్వకస్వామి, వీరభద్ర స్వామి దేవాలయాలలో గురువారం ధ్వజస్తంభాలను వైభవంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. రెండు రోజులుగా ఆలయాలలో అభిషేకం, దీక్షాహోమం, ప్రత్యేక పూజా హోమాలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవం జరిపించారు.

వ్యవసాయ రుణాలకు అడంగల్ అవసరం లేదు

వెల్దుర్తి, ఫిబ్రవరి 22 : వ్యవసాయ రుణాలకు అడంగల్ అవసరం లేదని తహసీల్దార్ అనంత ఆచారి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలో యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐ, రాయలసీమ బ్యాంకులు రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. 1బి, పట్టాదారు పాసుబుక్‌తో రైతులకు రుణాలు మంజూరు చేయవచ్చని తెలిపారు.

బంజారాల సింహగర్జనకు తరలి రండి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 22: కదిరి పట్టణంలో ఈ నెల 25న బంజారాల లక్షమంది సింహగర్జనకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆలిండియా బంజారా కర్నూలు జిల్లా అధ్యక్షులు సోమ్లా నాయక్ బంజారాలకు పిలుపునిచ్చారు. గురువారం పత్తికొండలో సింహగర్జన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల హక్కుల సాధనకై సాగించే సింహగర్జన సభకు బంజారాలందరూ ఐక్యతతో ముందుకు సాగి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బంజారాల ఐక్యతను చాటేందుకు కదిరి పట్టణంలో జరిగే సింహ గర్జనకు నాంది పలకాలని ఆకాంక్షించారు. నాయకులు కృష్ణానాయక్, భాస్కర్ నాయక్, రవీంద్ర నాయక్, గుండుతాండ సర్పంచ్ రంగా నాయక్, చక్రి నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు హత్తిబెళగల్ విద్యార్థులు

ఆలూరు, ఫిబ్రవరి 22: హత్తిబెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎన్నిక అయినట్లు ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ గురువారం తెలిపారు. ఈ నెల 24, 25వ తేదీలలో నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ విభాగంలో పీ రియాజ్, వరుణ్ కుమార్, పీ వాసు, బాలిక విభాగం నుంచి మానస, హలీమ, నూర్జహాన్, దాదాబి, రజియా పాల్గొంటారని తెలిపారు.

సింహగర్జనను జయప్రదం చేయండి

ఆలూరు, ఫిబ్రవరి 22: కర్నూలు ఎస్‌టీబీసీ గ్రౌండ్‌లో ఈనెల 29వ తేదీ నిర్వహించే వికలాంగుల సింహగర్జనకు వేలాది మంది వికలాంగులు తరలి రావాలని వికలాంగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మొలగవల్లి రామాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక ఆలూరు ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సింహగర్జన కరపత్రాలను విడుదల చేశారు. సాయి, ప్రకాష్, ఆలూరు, చిప్పగిరి హొలహర్వి సమాఖ్యల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు పట్టుకొని నీటి కోసం ..

- జంపాపురం హైస్కూల్‌లో తాగునీటి ఇక్కట్లు



కోసిగి, ఫిబ్రవరి 22: జంపాపురం హై స్కూల్‌లో తాగునీరు లేక విద్యార్థులు తల్లడిల్లుతున్నారు. గురువారం మధ్యాహ్న భోజనం చేసేందుకు నీరు లేక ఇలా గ్రామంలో వెతుకులాట ప్రారంభించారు. పాఠశాలలో 597 మంది విద్యార్థులు చదువుతున్నారు. హై స్కూల్‌లో ఉన్న బోరు మోటారు చెడిపోవడంతో నీటి సమస్య తలెత్తింది. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత తాగునీరు లేక అన్నం ప్లేట్లు పట్టుకుని గ్రామంలోకి పరుగులు పెడుతున్నారు. కొందరు విద్యార్థులు గ్రామంలో తిరిగి నీరు తెచ్చుకుంటుండగా గ్రామంలో ఉన్న తాగునీటి గుమ్మీలను ఆశ్రయించారు. నాడు-నేడు కింద ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసినప్పటికీ తాగునీరు రావడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయులు బండేనవాజ్‌ను వివరణ కోరగా బడిలో ఉన్న బోరు మోటారు రిపేరీలో ఉన్నందున తాగునీటి ఇబ్బందులు తలెత్తినట్లు తెలిపారు. అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద రైతులకు తిక్కారెడ్డి ఆర్థిక సాయం

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 22: హెచ్‌మురవణిలో రెండు రోజుల క్రితం గడ్డివాములు దగ్ధం కాగా విషయం తెలుసుకున్న మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి బాధిత రైతులకు ఆర్థిక సాయం అందించారు. తిక్కారెడ్డి తనయుడు తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయం బాధితులకు అందజేశారు. ఆయన వెంట దశరథరాముడు, నాయకులు సత్యన్న గౌడ్, జనార్ధన్ ఉన్నారు.

నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 22: రాష్ట్రంలోని నిరుద్యోగులతో వైసీపీ ప్రభుత్వం చెలగాటమాడుతోందని కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు నీలకంఠప్ప అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల పరిపాలనలో నిరుద్యోగులను ఏమాత్రం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం రాజకీయ నాటకంగా ఆయన అభివర్ణించారు.

ఘర్షణలో 9మందిపై కేసు నమోదు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 22: కందనాతి గ్రామంలో కుళాయి విషయంలో ఘర్షణ పడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన బోయ శివశంకర్, బోయ మారెన్న కుళాయి విషయంలో ఘర్షణ పడ్డారు. ఇరువురి ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 22: ఎమ్మిగనూరు మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి రథోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి ఆలయ అర్చకులు జలాభిషేకం, క్షీరాభిషేకం, కుంకుమార్చన, పుర్చాన, ప్రత్యేక అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. సాయంత్రం స్వామివారి మహారథోత్సవాన్ని కన్నుల పండువ జరిపారు. స్వామిని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు.

రాజధాని ఫైల్స్ చిత్రాన్ని ప్రదర్శించాలి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 22: కోర్టు ఆదేశాలను గౌరవించి రాజధాని ఫైల్స్ చిత్రాన్ని ఎమ్మిగనూరు థియేటర్లలో ప్రదర్శించేందుకు అవకాశం కల్పించాలని టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు రషీద్, దిల్‌షాద్, అలీ, సోమన్న, జయచంద్ర, ఏసేపు, చంద్ర, హజరుద్దీన్‌లు అధికారులను కోరారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవిని కలిసి చిత్రంపై ఉన్న కోర్టు స్టే వేకెట్ ఆర్డర్ కాపీని అందజేశారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి : బీవీ

నందవరం, ఫిబ్రవరి 22: గ్రామాలు తెలుగుదేశం పాలనతోనే గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కోటా వీధి, బీసీ కాలనీ, కింద గేరిలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీలో భాగంగా బీవీ పర్యటించారు. ఇంటింటి తిరిగి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే పేదలకు, నిరుద్యోగయువతకు, మహిళలకు చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. జగన్ పాలనలో గ్రామాల అభివృద్ధి శూన్యమన్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికార పార్టీ నాయకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వర్షాలు లేక సాగుచేసిన పంటలకు పెట్టుబడి రాబట్టుకోలేక రైతులు తల్లడిల్లుతున్నారని, కనీసం వారికి నష్టపరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రజలు అంతా గమనిస్తూనే ఉన్నారని జగన్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని స్పష్టం చేశారు.


మిరప రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, మండల పార్టీ కన్వీనర్ డీవీ రాముడు,,మాజీ వైస్ ఎంపీపీ రఘుమూర్తి, గురురాజా రావు, దర్మాపురం గోపాల్, మస్తాన్, షరీఫ్, రహిమాన్, తెలుగు ఈరన్న, వెంకటేశులు, శ్రీనివాస్, ప్రకాష్, బతుకన్న, నరసింహులు, సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి : టీడీపీ

ఆదోని(అగ్రికల్చర్), ఫిబ్రవరి 22: వైసీపీ అవినీతి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ఆదోని టీడీపీ మైనారిటీ నాయకుడు ఉమ్మి సలీం అన్నారు. గురువారం ఆయన పటంలోని ఫరీద్ సాహెబ్ మొహల్లా వీధిలో పర్యటించి, టీడీపీ మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సామాన్య ప్రజలను సైతం నవరత్న పథకాలతో దగా చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ అధినేత చంద్రబాబు మేనిఫెస్టోలో రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలు పేదలను సంపన్నులుగా చేసే పథకాలని అన్నారు. రాయలసీమలో సాగు, తాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. మరోసారి వైసీపీ నాయకులు చెప్పే మాయామాటలు నమ్మొద్దని, వచ్చే ఎన్నికల్లో తెదేపాకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు


మాట్లాడుతున్న టీడీపీ మైనారిటీ నాయకుడు ఉమ్మి సలీం

పట్టుబడిన వాహనాలు వేలం

- ఎమ్మిగనూరులో రూ. 10.8 లక్షలు, కోసిగిలో 3.80లక్షల ఆదాయం : సెబ్ డీఎస్పీ వినోద్ కుమార్

ఎమ్మిగనూరుటౌన్, ఫిబ్రవరి 22: ఎమ్మిగనూరు సెబ్ స్టేషన్ పరిధిలో కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను గురువారం సెబ్ డీఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వేలం వేశారు. 10 కార్లు, ద్విచక్ర వాహనాలను వేలం వేశారు. వేలం పాటలో పలువురు పాల్గొని వాహనాలను సొంతం చేసుకున్నారు. ఈ వేలం పాట ద్వారా ప్రభుత్వానికి రూ. 10,08,310 ఆదాయం సమకూరినట్లు సెబ్ డీఎస్పీ వినోద్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ సత్యానారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగిలో 28 వాహనాలు వేలం

కోసిగి : కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 28 వాహనాలకు సెబ్ పోలీసులు వేలం పాట నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్పీ రవికుమార్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంటు సూపరింటెండెంట్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో 28 వాహనాలకు వేలంపాట నిర్వహించారు. జీఎస్‌టీతో కలిసి రూ.3,80,196 ఆదాయం వచ్చినట్లు వినోద్ కుమార్ తెలిపారు. వేలం పాటలో బైకులను దక్కించుకోవడానికి మద్యం వ్యాపారులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్‌బాబు, సెబ్ సిబ్బంది ఉన్నారు.


సెబ్ స్టేషన్ వద్ద వాహనాలను వేలం వేస్తున్న డీఎస్పీ

రమణీయం.. పల్లకోత్సవం

మంత్రాలయం, ఫిబ్రవరి 22: వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయల పల్లకోత్సవం రమణీయంగా జరిగింది. గురువారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మఠం పండితులు, అర్చకులు, రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు పుష్పాభిషేకం, పాదపూజ చేసి పల్లకిలో ఉంచి ఊరేగించారు.

పోటెత్తిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిర్సింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది.


మఠం ప్రాంగంణంలో రద్దీగా ఉన్న భక్తులు

శ్రీమఠం అన్నదానానికి రూ. 2 లక్షలు విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి అనంతపురంకు చెందిన నారాయణ, గోవిందమ్మ అనేభక్తులు అన్నదానానికి రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పండితులు జ్ఞాపిక, శేషవస్త్రం ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ప్రొటోకాల్ పాటించకపోవడం సరికాదు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 22: నియోజకవర్గం నుంచి వైసీపీ తరుపున పోటీచేస్తున్న బుట్టారేణుక ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యటన సమయంలో ప్రొటోకాల్ పాటించకపోవడం సరికాదని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రి వైద్యాధికారి తన కుర్చీని బుట్టా రేణుకకు వదలటంతో పాటు ఆసుపత్రి కమిటి ఛైర్మన్ అయిన స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పక్కకుర్చీలో కూర్చోబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బుట్టా రేణుక ఏ పదవిలో లేకపోయినా వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండటంతో అధికారులు ప్రోటోకాల్ మర్యాదను పాటించకపోవటం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అధికారులు బుట్టా రేణుకకు తలొగ్గి ప్రవర్థించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు.


సూపరింటెండెంట్ కుర్చిలో కూర్చొని వైద్యులతో మాట్లాడుతున్న బుట్టా (ఫైల్)

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

కోసిగి, ఫిబ్రవరి 22: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఏపీయుడబ్లూజే జిల్లా సహాయ కార్యదర్శి హనుమేష్, తాలుకా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, మండల అధ్యక్షులు షబ్బీర్ అన్నారు. జర్నలిస్టులపైన, మీడియా సంస్థలపైన దాడులు అధికం కావడంతో ఏపీయుడబ్లూజే రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఛలో అనంతపురంలో భాగంగా గురువారం కోసిగి నుంచి ఛలో అనంతపురంకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి వెళ్తున్న జర్నలిస్టులను జిల్లాలో పోలీసులు అడుగడుగునా అడ్డు పడినా రాత్రి సమయాల్లో కొంత మంది జర్నలిస్టులకు హౌస్ అరెస్టులు, నోటీసులు ఇచ్చి స్టేషన్‌కు ముందస్తు అరెస్టులు చేసినా కూడా ఏపీయుడబ్లూజే నాయకులు మంత్రాలయం తాలుకా నుంచి అధిక సంఖ్యలో ఛలో అనంతపురంకు తరలివెళ్లి విజయవంతం చేశారు.

జర్నలిస్టులపై దాడి అమానుషం

పత్తికొండ టౌన్ : మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి కె.వీరశేఖర్‌పై అధికార పార్టీ నాయకులు దాడి చేయడం అమానుషమని బీసీసై నియోజకవర్గ ఇన్చార్జి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిజాలు నిర్భయంగా రాసే పత్రికా విలేకరులపైన, దినపత్రికల కార్యాలయాలపైన దాడులకు వైసీపీ నాయకులు పాల్పడటం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి

వెల్దుర్తి : ప్రజాస్వామ్యంలో నాల్గవ పిల్లర్‌గా పిలవబడే పత్రికలు, విలేకరుల స్వేచ్ఛను కాపాడడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకరక్షణ చట్టం తేవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలు ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అనుచరులు, వైసీపీ మూకల దాడులు.. మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడిని నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు ధర్నా నిర్వహించి తహసీల్దార్ అనంత ఆచారికి వినతిపత్రం సమర్పించారు.

క్రిష్ణగిరి : వైసీపీ గుండాలు జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం అప్రజాస్వామిక చర్యని టీడీపీ కర్నూలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆలంకొండ నబి సాహెబ్, కటారుకొండ మర్రి శ్రీరాములు అన్నారు. ప్రధాన కార్యదర్శి గురుస్వామి, మండల తెలుగు యువత అధ్యక్షుడు బోయ బొంతిరాళ్ల పాల్గొన్నారు.



ఛలో అనంతపురం ధర్నాలో పాల్గొన్న కోసిగి జర్నలిస్టులు

కుంకనూరులో ఇద్దరు చిన్నారులకు డెంగీ

దేవనకొండ, ఫిబ్రవరి 22: కుంకనూరు గ్రామంలో ఆరేళ్లలోపు ఇద్దరు చిన్నారులు డెంగీ బారిన పడ్డారు. వారం రోజులుగా జ్వరం వస్తుండగా వైద్యం కోసం ఆదోనిలోని ప్రైవేట్ వైద్యశాలలో పరీక్షించగా చిన్నారులు డెంగీ బారిన పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలో డెంగీ కేసులు పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తోందని ప్రజలు వాపోతున్నారు.దోమల వ్యాప్తి నియంత్రించకపోవడంతో డెంగీ కేసుల పెరిగిపోతున్నాయి.

రాష్ట్రంలో తాలిబన్ల పాలన

మద్దికెర, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో జర్నలిస్టుల మీద హత్యాప్రయత్నాలు, పత్రికా కార్యాలయాలపై దాడులు చూస్తుంటే.. తాలిబన్ల పాలన నడుస్తోందని సౌత్ ఇండియన్ కార్పొరేషన్ జిల్లా అధ్యక్షుడు వైటి వీరన్న అన్నారు. గురువారం మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసు ఉన్నతాధికారులు జగన్ పార్టీ కార్యకర్తలమాదిరి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విలేకరులపై, కార్యాలయాలపై పట్టపగలు దాడి చేసినా నిందితులను అరెస్టు చేయకుండా చోద్యం చూడటం సిగ్గు చేటన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

మద్దికెర, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో జర్నలిస్టులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం రక్షణ కల్పించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ మదనంతపురం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అవినీతి అరాచకాలు దౌర్జన్యాలను ప్రశ్నించే మీడియా గొంతుకలను నొక్కుతూ జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్యని పేర్కొన్నారు. సంజప్ప, ఉలిగన్న, సంజీవులు ఉన్నారు.

25న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

మద్దికెర, ఫిబ్రవరి 22: గామ దేవత మదమాంబ రథోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి న్యూకేటగిరి ఒంగోలు ఎద్దుల రాతిదూలం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం మద్దికెర గ్రామంలో కమిటీ నిర్వాహకులు డి.శ్రీనివాసులు, కవిరెడ్డి గోపాల్, ఆకుల ఖాజావలి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ నెల 25న ఆదివారం ఉదయం జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్ గ్రౌండు దగ్గర రాతిదూలం పోటీలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు 9849409827, 88776577702ను సంప్రదించాలని సూచించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత

ఆదోని(అగ్రికల్చర్), ఫిబ్రవరి 22: ఆదోని మండలం 104 బసాపురం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థి ఎన్‌ఆర్ఐ సోనేశాచారి పాఠశాలకు చేయూత నిచ్చారు. లండన్‌లో ఎంఎస్ పూర్తి చేసుకొని, అక్కడే స్థిరపడి, సొంత గ్రామానికి వచ్చిన సోనేశాచారి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అవసరమైన ఇండోర్ గేమ్స్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమైనవి అన్నారు. ప్రతి విద్యార్థి మంచిగా చదువుకొని, తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి ఉన్నతంగా రాణించాలని సూచించారు. చదువులు నేర్పిన గురువు భైరప్పను తన మిత్రులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మిత్రులు లింగప్ప యాదవ్, మల్లికార్జున, గోవర్ధన్, మంజు, మల్లయ్య, వీరేష్ పాల్గొన్నారు.

27 నుంచి శివస్వాములకు అన్నదానం


ఆదోని టౌన్, ఫిబ్రవరి 22: మహాశివరాత్రి సందర్భంగా ఆదోని పట్టణం మీదుగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళ్లే శివ భక్తులందరికీ పట్టణ పొలిమేరలో భోజన సదుపాయం ఏర్పాటు చేయనున్నట్లు అల్మారుకు మఠంకు చెందిన మహర్షి విజయ్ కుమార్ స్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ఈనెల 27వ తేదీ నుంచి మార్చి రెండవ తేదీ వరకు ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఎమ్మిగనూరు రోడ్డులో బైపాస్ రోడ్డు ప్రాంతంలో ఉన్న ఆల్కారు మఠంలో అన్నప్రాసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఉచిత రక్తనాళాల పరీక్షా శిబిరం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 22: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషన్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన స్థానిక వాసవి కళ్యాణ మండపంలో ఉచిత రక్తనాళాల పరీక్షా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రక్తనాళాలకు సంబంధించిన వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య అధికంగా ఉండడంతో ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ వారి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అవసరమైన ప్రతి ఒక్కరికి రూ.4,500 విలువచేసే వివిధ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి, వారికి అవసరమైన మందులను అందజేస్తామని పేర్కొన్నారు.

వలసలు నివారించడంలో ప్రభుత్వాలు విఫలం

- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి


మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న నాయకులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 22: వలసలను నివారించడంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న విమర్శించారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాలిమంచిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎస్సీ కాలనీలో 120 కుటుంబాలు ఉంటే 80 కుటుంబాలు వలస వెళ్లారన్నారు. వలసలను నివారించడంలో, ఉపాధి పనులు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. గడిచిన 20 రోజుల్లో వలస వెళ్లిన ఆనంద్, తిక్కన్న అనే కూలీలు అక్కడే మృత్యువాత పడ్డారని, ఆ కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి, వెంకటేశులు, నాగేంద్రమ్మ, ఈరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఐ

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 22: గ్రామాల్లోని ప్రజలు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని కడిమెట్ల , సిరాలదొడ్డి గ్రామాల్లో ఆయన కలియతిరిగారు. అనంతరం గ్రామస్థులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైన అల్లరిమూకలు అల్లర్లకు పాల్పడితే తమకు సమాచారం అందజేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, చట్టవిరుద్ధ పనులు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.